క్లుప్తంగా

కొత్తమ్మ, దుర్గమ్మలను దర్శించుకున్న బడ్డుకొండ



అమ్మవార్లను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ గ్రామంలో నూతనంగా నిర్మించిన కొత్తమ్మ,దుర్గమ్మ ఆలయంలో అమ్మవార్లను వేదమంత్రాల నడుమ సోమవారం ప్రతిష్ఠించారు. మాజీ ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఆకుల పైడిరామ్, తదితరులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అనుమతుల్లేని నిర్మాణం తొలగింపు



పునాదులు తొలగిస్తున్న సిబ్బంది

విజయనగరం: పట్టణంలోని దాసన్నపేట ప్రాంతంలో అనుమతుల్లేకుండా చేపడుతున్న నిర్మాణాన్ని కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ అధికారులు, సిబ్బంది సోమవారం తొలగించారు. దాసన్నపేటలోని వాటర్‌ట్యాంక్ నుంచి ఎర్ర చెరువుకు వెళ్లే ప్రాంతంలో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి అనుమతుల్లేకుండా పునాదులు తీశారు. ఈ విషయమై ఫిర్యాదు రాగా కమిషనర్ పల్లి నల్లనయ్య స్పందించి, నిర్మాణాన్ని తొలగించాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ.. అనుమతులు లేని నిర్మాణాలను ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

దొంగతనాల నివారణకు చర్యలు

- రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్



సిబ్బందితో మాట్లాడుతున్న విశాఖ లైన్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్

విజయనగరం క్రైమ్: రైళ్లల్లో దొంగతనాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు రైల్వే లైన్స్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ అన్నారు. విజయనగరం రైల్వే జీఆర్‌పీ స్టేషన్‌ను సోమవారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న సిబ్బందితో సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గంజాయి వంటి నిషేధిత మాదకద్రవ్యాలను రవాణా చేస్తున్న వారిపై ప్రతి ఒక్కరూ నిఘా పెట్టాలన్నారు. కార్యక్రమంలో రైల్వే జీఆర్‌పీ ఎస్సై వి.బాలాజీరావు, తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

పూసపాటిరేగ: కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తహసీల్దార్ తాడ్డి గోవింద సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబరు 2వ తేదీ నుంచి 28 వరకు దరఖాస్తులు అందజేయాలని పేర్కొన్నారు. గతంలో వచ్చిన దరఖాస్తులను సైతం పరిశీలించి సంక్రాంతి నాటికి కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం

విజయనగరం ఫోర్ట్: సైబర్ నేరాల పట్ల మహిళలు అప్రమత్తంగా ఉండాలని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ తానే అనిత అన్నారు. సోమవారం స్థానిక గాయత్రి జూనియర్ కళాశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. ఆపదలో ఉన్న మహిళలు రక్షణ, సంరక్షణ కోసం వన్‌స్టాప్ సెంటర్‌ను ఆశ్రయించాలని తెలిపారు. 24 గంటల పాటూ వన్‌స్టాప్ సెంటర్ పనిచేస్తుందన్నారు. బాల్య వివాహాల నిరోధానికి చైల్డ్‌లైన్ 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

జీసీసీ బలోపేతానికి చర్యలు

విజయనగరం అర్బన్: జీసీసీ బలోపేతానికి అవసరమైన చర్యలు చేపడుతున్నామని ఆ సంస్థ రాష్ట్ర చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు విజయనగరంలోని సబ్బుల తయారీ యూనిట్‌ను ఆయన సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సబ్బులు ఏ యంత్రాలతో తయారు చేస్తున్నారో? ఏ విధంగా తయారు చేస్తున్నదీ నిశితంగా పరిశీలించారు. మామూలు చేతి యంత్రాలతోనే సబ్బులు తయారు చేస్తున్నామని దాని ద్వారా ఉత్పత్తి నెమ్మదిగా ఉంటుందని సిబ్బంది చెప్పగా ఆటోమేటిక్ యంత్రాల ఏర్పాటుకు ముఖ్యమంత్రితో మాట్లాడి చర్యలు తీసుకుంటామని చెప్పారు. అవుట్ సోర్సింగ్ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని ఆయనకు వినతిపత్రాన్ని అందజేశారు. సమస్యల పరిష్కారానికి చైర్మన్ సానుకూలంగా స్పందించారు. తొలుత సిబ్బంది ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో జీసీసీ సిబ్బంది సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన పని గంటలు
- పైలట్ ప్రాజెక్టుగా మండలానికో పాఠశాల ఎంపిక
- త్వరలో అన్ని ఉన్నత పాఠశాలల్లో అమలుకు చర్యలు



పాఠశాల విద్యార్థులు

నూతన విధానం.. విజయవంతమయ్యేనా...?

విజయనగరం: పాఠశాల విద్య బలోపేతం పేరుతో కూటమి ప్రభుత్వం తీసుకున్న నూతన విధానం అమలుపై నీలినీడలు అలుముకుంటున్నాయి. పాఠశాలల పని గంటల పెంపుపై తీసుకున్న నిర్ణయంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నూతన విధానం అమలులో భాగంగా పైలెట్ ప్రాజెక్ట్‌గా మండలానికో పాఠశాలను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా విజయనగరం నియోజకవర్గం పరిధిలో కస్పా మున్సిపల్ కార్పొరేషన్ ఉన్నత పాఠశాలను ఎంపిక చేశారు. ఈ మేరకు నూతన విధానం అమలుపై ప్రతిరోజూ నివేదికల తయారీకి విద్యాశాఖ అధికారులు సన్నద్ధమయ్యారు.

విజయనగరం నియోజకవర్గ పరిధిలో 93 ప్రాథమిక, 10 ప్రాథమికోన్నత, 19 ఉన్నత పాఠశాలలు ఉన్నట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3.45 గంటల వరకు.. ఉన్నత పాఠశాలలు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు నిర్వహిస్తున్నారు. వీటిలో వ్యాయామం, హెల్త్ ఎడ్యుకేషన్, మాస్టర్ డ్రిల్ వారానికి మూడు తరగతులు ఉంటాయి. ఇటీవల పనిగంటలు పెంచాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సోమవారం నుంచి అమల్లోకి వచ్చింది. దీనిపై ఇప్పటికే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎంపిక చేసిన పాఠశాలలో ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు జరుగుతాయి. అదనపు సమయాన్ని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఏ విధంగా సద్వినియోగం చేసుకుంటున్నారు. ఫలితాలెలా ఉండనున్నాయి, ఇబ్బందులేమైనా ఉంటాయా.. అనేది తెలుసుకుంటారు. ఈ సమాచారం ప్రధానోపాధ్యాయుల నుంచి డీఈఓకు, అక్కడ నుంచి ప్రభుత్వానికి చేరుతుంది. విశ్లేషించి సమయం పెంపుపై నిర్ణయం తీసుకుంటారు. పాఠశాల సమయం పెంచడం వల్ల విద్యార్థుల చదువుకు మరింత తోడ్పాటు ఇచ్చినట్లవుతుందని విద్యాశాఖ అధికారులు యోచిస్తుంటే, ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. దశాబ్దాలుగా ఉన్నత పాఠశాలలు రోజుకు 7 గంటలు పనిచేస్తున్నాయని, ఏ రాష్ట్రంలో 8 గంటల విధానం లేదని చెప్పుకొస్తున్నాయి. నిర్ణయం ఉపసంహరించుకోవాలని కోరుతున్నారు.

అందరి అభిప్రాయాలతో ముందుకు

పాఠశాలల సమయం మార్పుపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయల అభిప్రాయాలను సేకరిస్తాం. అందరి అభిప్రాయాలు తీసుకున్న తర్వాత వీటిని ఏ విధంగా అమలు చేయాలనే అంశంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని వివరించారు. ముందుగా మండలానికో పాఠశాల ఎంపిక చేశాం. తదుపరి ఉన్నతాధికారుల ఉత్తర్వుల మేరకు ఉన్నత పాఠశాలల్లో అమలు చేస్తాం.

– రాజు, మండల విద్యాశాఖ అధికారి, విజయనగరం.

ప్రస్తుతం ఒక్క పాఠశాలలోనే..

పాఠశాలల సమయం పెంచేందుకు ప్రభుత్వం నిర్ణయించడంతో మండలానికి రెండు పాఠశాలలు ఎంపిక చేయాల్సిఉండగా, ప్రస్తుతం ఒక్క పాఠశాలనే ఎంపిక చేశారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ పాఠశాలలు పనిచేస్తాయి. ప్రతిరోజూ ప్రధానోపాధ్యాయులు ఇందుకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలి. నూతన విధానం ప్రకారం 9 గంటలకు పాఠశాల ప్రారంభం కానుంది. 20 నిమిషాలు స్కూల్ అసెంబ్లీ జరుగుతుంది. 9.25 గంటలకు మొదటి పిరియడ్ ప్రారంభం కాగా 12.45 నుంచి గంట పాటు భోజన విరామం ఉంటుంది. అనంతరం ఐదు, ఆరో పిరియడ్‌ల తర్వాత చిరు విరామం ఇస్తారు. 4.15 నుంచి 5.00 గంటల వరకు ఎనిమిదో పిరియడ్ జరుగుతుంది.

స్పందన అంతంతమాత్రమే



విజయనగరం రూరల్: పరిష్కార వేదికలో కార్యదర్శులతో మాట్లాడుతున్న ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతి



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న అధికారులు

విజయనగరం: మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు స్పందన కరవవుతోంది. వివిధ సమస్యల పరిష్కారానికి యంత్రాంగం నిర్వహించే కార్యక్రమానికి ఎటువంటి ఫిర్యాదులు రాకపోవడమే ఇందుకు తార్కాణంగా నిలుస్తోంది. సోమవారం స్థానిక కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుంచి రెండు ఫిర్యాదులు వచ్చాయి. వీటిని స్వీకరించిన అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్ తిరుమలరావు సమస్యల పరిష్కారానికై ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంఈ టి. రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, టీపీఆర్‌ఓ సింహాచలం, మేనేజర్ ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

స్పందన కరువు

విజయనగరం రూరల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు ఒక్క ఫిర్యాదు కూడా అందలేదని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ తిరుపతిరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సమస్యలు తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో పలువురు సిబ్బంది పాల్గొన్నారు

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం..



దెంకాడ: చొల్లంగిపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే లోకం నాగమాధవి

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి

భోగాపురం: ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతులకు అనుకూలంగా వ్యవహరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. కార్యక్రమంలో వందనాల రమణ, రామిశెట్టి జనార్దనరావు, గుండపు నానాజీ సూరిబాబు, పల్లంట జగదీష్, మాత నవీన్, గుండు దిలీప్, బొల్లు త్రినాథ్, పల్ల రాంబాబు, తహసీల్దార్ సురేష్, అగ్రికల్చర్ ఏఓ హరికృష్ణ, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల ద్వారా ధాన్యం సేకరణ

దెంకాడ: రైతులందరూ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రైతు సేవాకేంద్రాల్లో రైతులు తమ పేర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ పి. నిర్మల, ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, చొల్లంగిపేట, డి.కొల్లాం సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, ఏడీఏ నాగభూషణం, పీఏసీఎస్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు అవగాహన సదస్సు

విజయనగరం అర్బన్: జిల్లాలోని ఖాతాదారులకు బ్యాంక్ వినియోగంపై నగరంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం నిర్వహించనున్నట్లు ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ ఎం.సురేష్ బాబు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు ప్రారంభమయ్యే ఈ సదస్సుకు ఖాతాదారులు హాజరై బ్యాంక్ అందిస్తున్న ఆర్థిక సేవలు తెలుసుకోవాలని సూచించారు.

రామతీర్థంలో మార్మోగిన శివ నామస్మరణ



ఉమాసదా శివాలయంలో శివుడిని దర్శించుకుంటున్న భక్తులు

నెల్లిమర్ల రూరల్: కార్తీకమాసం నాలుగో సోమవారం పురస్కరించుకుని పవిత్ర పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీరామస్వామివారి ఆలయానికి సోమవారం భక్తులు పోటెత్తారు. ముందుగా స్థానిక భాస్కర పుష్కరిణిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలను వెలిగించారు. అనంతరం రామాలయంలో సీతారామస్వామిని భక్తి శ్రద్ధలతో దర్శించుకున్నారు. ఆలయక్షేత్రపాలకులైన ఉమా సదాశివాలయంలో శివుడిని దర్శించి పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు మల్లికార్జున శర్మ ఆధ్వర్యంలో శివుడికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఈఓ శ్రీనివాసరావు దగ్గరుండి ఏర్పాట్లను పర్యవేక్షించారు. కార్యక్రమంలో అర్చకులు సాయిరామాచార్యులు, నరసింహాచార్యులు, కిరణ్, సిబ్బంది తులసి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాధిత మహిళలకు భరోసాగా 'శక్తిసదనాలు'

విజయనగరం అర్బన్: అత్యాచార బాధిత మహిళలకు ఉపాధి కల్పనతో పాటు జీవితానికి దారి చూపించే జిల్లాలో ఏర్పాటు చేసిన శక్తి సదనాలను నిర్వహించాలని అధికారులకు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదేశించారు. శక్తిసదన్‌ల నిర్వహణపై కలెక్టరేట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మిషన్ శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో ఏర్పాటైన రెండు శక్తి సదనాలను మరో ఏడాది పాటు కొనసాగించే అంశంపై పరిశీలనకు ఇద్దరు అధికారులతో కమిటీని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ శాంతికుమారి, డీఈఓ యు.మాణిక్యంనాయుడు, డీటీఓ కుమార్, డీఎస్‌డబ్ల్యూ రామానందం, దివ్యాంగుల శాఖ ఏడీ జగదీష్, స్కిల్ డెవలప్‌మెంట్ మేనేజర్ ప్రశాంత్ కుమార్, డీఎస్‌పీ వీరకుమార్, మహిళా ప్రాంగణం మేనేజర్ విమల, తదితరులు పాల్గొన్నారు.

లింగ ఆధారిత వివక్షపై నిరసన

లింగ అసమానత్వ సమస్యలను ఎదుర్కొనేందుకు దేశమంతా లింగ వివక్షకు వ్యతిరేకంగా జాతీయ ప్రచార కార్యక్రమాలను రూపొందించినట్టు కలెక్టర్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలిపారు. దీనికి సంబంధించిన ప్రచార పోస్టర్‌ను సోమవారం ఆయన ఆవిష్కరించి జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అమ్మాయిలను, అబ్బాయిలను సమానంగా చూస్తామని, బాలికలను ఉన్నత విద్య, ఉద్యోగాల కోసం ప్రోత్సహిస్తామని, బాల్యవివాహాలను అరికడతామని ప్రతిజ్ఞ చేయించారు. వచ్చేనెల 23వ తేదీ వరకు పలు ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో జేసీ సేతు మాధవన్, డీఆర్వో శ్రీనివాసమూర్తి, డీఆర్‌డీఏ పీడీ కళ్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

లింగ వివక్ష లేని సమాజమే లక్ష్యం

- ఎమ్మెల్యే లోకం నాగమాధవి



ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే నాగమాధవి, ప్రజాప్రతినిధులు, అధికారులు, మహిళలు



నెల్లిమర్ల: ర్యాలీలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల మహిళలు

దెంకాడ: లింగవివక్ష లేని సమాజం కోసం అందరూ కృషి చేయాలని ఎమ్మెల్యే లోకం నాగమాధవి అన్నారు. మండలంలోని చొల్లంగిపేటలో జెండర్ క్యాంపెయిన్–3.0ను ఆమె సోమవారం ప్రారంభించారు. మండల వెలుగు విభాగం ఆధ్వర్యంలో స్వయం ఉపాధి సంఘాల మహిళతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బాల్య వివాహాల వలన చాలా అనర్థాలు చోటుచేసుకుంటాయన్నారు. మహిళలు గృహహింసను ఎదుర్కొనేందుకు రక్షణగా అనేక చట్టాలున్నాయని, వాటిపై మహిళలకు అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ బంటుపల్లి వాసుదేవరావు, ఏపీఎం శ్రీనివాస్, సర్పంచ్‌లు కోరాడ కనకరాజు, అట్టాడ కృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు గుడివాడ కిరణ్, వెలుగు సీసీలు, స్వయం సహాయ సంఘాల మహిళలు పాల్గొన్నారు.

లింగ ఆధారిత హింస నివారించాలి..

నెల్లిమర్ల: లింగ ఆధారిత హింస నివారణకు అన్ని వర్గాలు సహకరించాలని డీఆర్‌డీఏ ఏపీడీ కె. సావిత్రి పిలుపునిచ్చారు. ఏపీ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ.. జెండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయస్థాయి కార్యాచరణ ప్రణాళిక ఈనెల 25 నుంచి వచ్చే నెల 23 వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె. రామకృష్ణరాజు, ఏరియా కో ఆర్డినేటర్ బి. బంగారమ్మ, హెచ్‌డీ ఏపీఎం కె. గీత, స్త్రీనిధి మేనేజర్ బి. ఎర్రినాయుడు, తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికత అంశాలపై అవగాహన అవసరం



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు

విజయనగరం: బాల్యం నుంచే పిల్లలకు ఆధ్యాత్మికత అంశాలపై శిక్షణ ఇవ్వాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందని ప్రముఖ ఆధ్యాత్మికవేత్త ఉపద్రష్ట వేంకట వరప్రసాద్ అన్నారు. పంచముఖ ఆంజనేయస్వామి దేవాలయం, భక్తి సమాచారం పత్రిక సంయుక్త ఆధ్వర్యంలో దేవాలయం ఆవరణలో సోమవారం జరిగిన ఆధ్యాత్మిక క్విజ్ కార్యక్రమానికి వరప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తి సమాచారం సంపాదకుడు సముద్రాల నాగరాజు మాట్లాడుతూ.. రామాయణం, భాగవతం, భారతం గురించి విద్యార్థులకు పూర్తి అవగాహన ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ విషయంలో తల్లిదండ్రులే బాధ్యత వహించాలని సూచించారు. అనంతరం క్విజ్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో దేవాలయం చైర్మన్ మడిపల్లి వెంకటాచలం, పెంటపాటి ముత్యాలు, నాదం, తదితరులు పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా..



ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిసరాల్లో జేసీబీతో చదును చేస్తున్న దృశ్యం

విజయనగరం: ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య తెలిపారు. ఇటీవల నిర్వహించిన క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా కేఎల్ పురంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఆ చుట్టు పక్కల ప్రాంతాలను గమనించారు. ఆ ప్రాంతంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ లేదని, అలాగే అప్రోచ్ రోడ్డు కూడా లేదని స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అవసరమైన మౌలిక సదుపాయాలు తక్షణమే కల్పించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. దీంతో సోమవారం సిబ్బంది మౌలిక సదుపాయాల కల్పన పనులను ప్రారంభించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చుట్టూ ఉన్న మట్టి రోడ్డును చదును చేశారు. అలాగే ప్రహరీ నిర్మించి అవసరమైన అన్ని సదుపాయాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

శివాలయాలకు పోటెత్తిన భక్తులు

కార్తీకమాసం చివరి సోమవారం కావడంతో శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. శివదీక్షారుల శరణుఘోషతో శివనామ స్మరణ మార్మోగింది. మహిళా భక్తులు దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. – సాక్షి నెట్‌వర్క్



విజయనగరం టౌన్: కంటోన్మెంట్ సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో దీపారాధన



పూసపాటిరేగ: మండల కేంద్రంలోని శివాలయంలో పూజలందుకుంటున్న శివయ్య



నెల్లిమర్ల రూరల్: సారిపల్లి దిబ్బేశ్వరస్వామి ఆలయం వద్ద పోలీస్ పహారా..



పశుపతినాథేశ్వర ఆలయంలో స్పటిక లింగానికి పాలాభిషేకం చేస్తున్న అర్చకుడు



విజయనగరం పశుపతినాథేశ్వర ఆలయంలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



పశుపతినాథేశ్వర ఆలయంలో ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగిస్తున్న మహిళలు



విజయనగరం పశుపతినాథేశ్వర ఆలయంలో సామూహిక రుద్రాభిషేకంలో పాల్గొన్న భక్తులు